RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 13 గురువారం 2026 | సంపుటి : 16 | సంచిక : 190 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | THURSDAY AUGUST 13 2026 | VOL:16 | ISSUE: 190 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# బకాయిలు చెల్లించని రైస్ మిల్లులపై ఉక్కుపాదం

- డిఫాల్ట్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అంశంపై పరిశీలన
- బకాయిల వసూళ్లకు ప్రత్యేక విధానం రూపొందించాలి : సీఎం రేవంత్‌రెడ్డి
- మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను సహించేది లేదు
- ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలతో గోదాంల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్
- ప్రతి జిల్లాకు నోడల్ అధికారిని నియమించాలని ఆదేశం



హైదరాబాద్: ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు (మిగతా 2వ పేజీలో..)

## చంద్రబాబు ఒక విజనరీ లీడర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



- నిజమైన అభివృద్ధికి చంద్రబాబు చిరునామా అన్న ద్రౌపది ముర్ము
- ఏపీ అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంస
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నారన్న రాష్ట్రపతి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని కొనియాడిన ఆమె... రాష్ట్రంలో నిజమైన అభివృద్ధికి ఆయనే అసలైన చిరునామా అని స్పష్టం చేశారు. సాంకేతికత, పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చేపట్టిన సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు

(మిగతా 2వ పేజీలో..)

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు..డీలిమిటేషన్‌కు సీఎం విజయ్ నో

హైదరాబాద్ : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకువచ్చింది. నియోజకర్గాల పునర్ వ్యవస్థీకరణ కోసం కేంద్రం తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా (మిగతా 2వ పేజీలో..)



## మేం టీ హబ్ తెస్తే.. రేవంత్ రెడ్డి అనుముల హబ్స్ అనే పథకాన్ని తెచ్చాడు.. కేటీఆర్ విమర్శ

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు గతంలో టీ-హబ్ ఏర్పాటు చేశామని, అయితే ప్రస్తుతం 'అనుముల హబ్స్' పేరుతో కుటుంబ ఆధారిత కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారని సెటైర్ వేశారు.నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్‌ను నిర్మించామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం కుటుంబ సభ్యుల ఆధారంగా, ఎలాంటి ఆవిష్కరణలు, ఉద్యోగులు లేకుండా 'అనుముల హబ్స్'ను రూపొందిస్తున్నారని విమర్శించారు. అనుముల కుటుంబానికి చెందిన వారైతే తక్కువ ధరకు ప్రభుత్వ భూములు కేటాయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. దీనిపై ఎలాంటి ప్రశ్నలు అడగడం





లేదని వ్యాఖ్యానించారు.'అనుముల కొండల్‌రెడ్డి'ని శతాబ్దపు గొప్ప ఆవిష్కర్తగా ప్రతిపాదిస్తున్నానంటూ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు (మిగతా 2వ పేజీలో..)

## జెన్-జీకి మోదీ కీలక సూచనలు.. షార్ట్‌కట్‌లకు దూరంగా ఉండండి

- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్-జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో

(మిగతా 2వ పేజీలో..)



## తెలంగాణలో 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల' పథకం ప్రారంభం: నియోజకవర్గానికి వెయ్యి మందికి లబ్ధి

- బీసీ మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- విధి విధానాలను రేపు ప్రకటించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల



(మిగతా 2వ పేజీలో..)

## అమెరికాలో అదానీపై కేసు కొట్టివేత.. మోదీపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

- వెనక చాలా పెద్ద కథ ఉందన్న రాహుల్ గాంధీ వ్యాఖ్య
- మోదీ భారత ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపణ




# డియర్ యంగ్ ఫ్రెండ్స్.. యువతకు సీఎం చంద్రబాబు సందేశం

- నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం
- యువతకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు
- యువతే మన శక్తి, బలం, రేపటి ఆశ అని వ్యాఖ్య
- యువత కలలు సాకారం చేసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ, అవకాశాలు కల్పిస్తామని హామీ
- మెరుగైన భవిష్యత్తును అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం
- ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపు

నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం (ఆగస్టు 12) సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు "డియర్ యంగ్ ఫ్రెండ్స్" అంటూ రాష్ట్ర యువతకు శు



భాకాంక్షలు తెలిపారు. యువతే మన శక్తి, బలం అని, రేపటి భవిష్యత్తుకు వారే ఆశాకిరణాలని ఆయన అభివర్ణించారు. యువత ఆశయాలకు అనుగుణంగా, వారికి బంగారు భవిష్యత్తును అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం (మిగతా 2వ పేజీలో..)

తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## మేం టీ హబ్ తెస్తే.. రేవంత్ రెడ్డి అనుముల హబ్స్ అనే పథకాన్ని తెచ్చాడు.. కేటీఆర్ విమర్శ

మొదటి పేజీ తరువాయి)

సంధించారు. ఎలాంటి పెట్టుబడి లేకుండానే 'టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే రక్షణ రంగ సంస్థను ఏర్పాటు చేసి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించారని ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలోని లక్షలాది మంది యువతకు ప్రభుత్వ విలువైన భూములను వందల కోట్ల రూపాయల మేర ఎలా పొందాలో బోధించాలని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ 'మ్యాజిక్ ట్రిక్'ను కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం చేయాలని ప్రశ్నించారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు..డీలిమిటేషన్‌కు సీఎం విజయ్ నో

మొదటి పేజీ తరువాయి)

ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. "ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి" అని కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచారు.

## చంద్రబాబు ఒక విజనరీ లీడర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, ముఖ్యంగా అమరావతి నిర్మాణానికి, ఐటీ, పారిశ్రామిక రంగాల పురోగతికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దూరదృష్టి కలిగిన నాయకత్వంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రపతి నుంచి వచ్చిన ఈ ప్రశంసలపై టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను బహుకరించారు. ఆ పుస్తకంలోని రాజధాని అమరావతి విశేషాలు, ఫొటోలను రాష్ట్రపతి ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టిని కొనియాడుతూ, ఆయన నిజమైన అభివృద్ధికి చిరునామా అని, ఒక విజనరీ లీడర్ అని రాష్ట్రపతి ప్రశంసల వర్షం కురిపించారు.అంతేకాకుండా, ఎంపీ అప్పలనాయుడి నిబద్ధతను రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సమావేశాలకు ప్రతిరోజూ సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరు నమోదు చేసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సంస్కారం, నిరాడంబరత కలిగిన అప్పలనాయుడిని చూస్తుంటే "నన్ను నేను చూసుకున్నట్లే ఉంది" అని అన్నారు.

## జెన్-జీకి మోదీ కీలక సూచనలు.. షార్ట్‌కట్‌లకు దూరంగా ఉండండి

మొదటి పేజీ తరువాయి)

అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు.యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

## తెలంగాణలో 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల' పథకం ప్రారంభం: నియోజకవర్గానికి వెయ్యి మందికి లబ్ధి

మొదటి పేజీ తరువాయి)

(బీసీ) మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్లు పంపిణీ చేసే సరికొత్త సంక్షేమ పథకాన్ని రేపు అధికారికంగా ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శ్రమను తగ్గించి, వేగంగా పని చేసుకునేందుకు వీలుగా ఈ అధునాతన ఆటోమేటిక్ మిషన్లను అందించబోతున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మంది మహిళలకు మిషన్లు అందించబోతున్నారు. లబ్ధిదారుల వయోపరిమితి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి, అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల వివరాలను మంత్రి రేపు అధికారికంగా వెల్లడిస్తారు. ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే తేదీలను, ప్రక్రియ మార్గదర్శకాలను ప్రకటించనున్నారు.

# బకాయిలు చెల్లించని రైస్ మిల్లులపై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.కేబినెట్ సబ్‌కమిటీలో దీనిపైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని మార్గనిర్దేశం చేశారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని హెచ్చరించారు.బకాయిల వసూళ్లకు ఒక విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోదాంల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు.గోదాంల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## అమెరికాలో అదానీపై కేసు కొట్టివేత.. మోదీపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

మొదటి పేజీ తరువాయి)

అమెరికాలో అదానీకి సంబంధించిన కేసు కొట్టివేతపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ పరిణామంపై ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని ఘాటు విమర్శలు చేశారు. అమెరికా కోర్టు నిర్ణయం వెనక మరింత కథ ఉందని వ్యాఖ్యానించారు.అమెరికాలో అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ సహా ఇతరులపై నమోదైన దాదాపు రెండేళ్ల నాటి క్రిమినల్ కేసును న్యూయార్క్‌లోని ఫెడరల్ న్యాయమూర్తి సోమవారం కొట్టివేశారు. ఈ కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని అమెరికా న్యాయశాఖ కోర్టును కోరింది.ఈ నేపథ్యంలో కేసు కొట్టివేత వార్త స్క్రీన్‌షాట్‌ను రాహుల్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేస్తూ మోదీపై విమర్శలు చేశారు. "పైకి కనిపిస్తున్నదానికంటే ఈ వ్యవహారం వెనుక ఇంకా చాలా ఉంది. ఒత్తిడికి లోనైన ప్రధాని భారత ప్రయోజనాలను తాకట్టు పెట్టాల్సి వచ్చింది. అందుకు దేశం భారీ మూల్యం చెల్లిస్తోంది" అని రాసుకొచ్చారు.ఈ కేసులో భారత్‌లోని ప్రభుత్వ అధికారులకు లంచం ఇచ్చేందుకు కుట్ర చేశారన్నది ప్రధాన ఆరోపణ. సౌర విద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్టు దక్కించుకునేందుకు ఈ ప్రయత్నం జరిగిందని 2024 నవంబరులో అమెరికా అధికారులు అభియోగాలు నమోదు చేశారు. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను అప్పట్లోనే ఖండించింది. తమ సంస్థలు, అధికారులు చట్టాలకు అనుగుణంగానే వ్యవహరించారని స్పష్టం చేసింది.కేసును కొట్టివేయాలన్న న్యాయశాఖ నిర్ణయంపై న్యాయమూర్తి నికోలస్ గరాఫిస్ గతంలో ప్రశ్నలు లేవనెత్తారు. నిర్ణయానికి మరిన్ని వివరణలు ఇవ్వాలని కోరారు. నిందితులు అమెరికా పౌరులు కాదని, వారు ఎప్పుడూ అమెరికా కోర్టుకు హాజరు కాలేదని న్యాయశాఖ పేర్కొంది.

## డియర్ యంగ్ ఫ్రెండ్స్.. యువతకు సీఎం చంద్రబాబు సందేశం

మొదటి పేజీ తరువాయి)

చేశారు.ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ప్రియమైన యువ మిత్రులారా, మీరే మా శక్తి. మీరే మా బలం. రేపటి ఆశ, వాగ్దానం మీరే" అని పేర్కొన్నారు. ప్రతి యువతీ యువకుడు తమకు నచ్చిన మార్గాన్ని ఎంచుకుని, ఆశించిన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, అవకాశాలు కల్పించే భవిష్యత్తును నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. యువత కలలు కనడమే కాకుండా, వాటిని సాకారం చేసుకునేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు."మేము ఈ రోజు చేస్తున్న ప్రతి పని అంతిమంగా మీకు మెరుగైన రేపటిని అందించడం కోసమే. విస్తృత అవకాశాలు, కలలు కనే స్వేచ్ఛ, వాటిని నిజం చేసుకునేందుకు అవసరమైన మద్దతుతో కూడిన భవిష్యత్తును అందించడమే మా ధ్యేయం" అని చంద్రబాబు వివరించారు. ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత కూడా భాగస్వాములు కావాలని, అందరం కలిసికట్టుగా నవ సమాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. యువతకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తనతో కలిసి రావాలని ఆహ్వానించారు.

## రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

రాజ్యసభలో బుధవారం 'లుంగీవాలా' వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే 'లుంగీవాలా' అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని, దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు. ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.



తెలుగు దినపత్రిక
# దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# ఎల్‌నినో ప్రభావం.. రైతులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ దివాకర టీఎస్










**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 12(దేశ టైమ్స్ )**

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రెండు, మూడు నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. రెండు, మూడు రోజుల వర్షాలను చూసి సాధారణ వర్షపాతం నమోదవుతుందని భావించి అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని స్పష్టం చేశారు.కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎల్‌నినో పరిస్థితులు, జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, వ్యవసాయంపై ప్రభావం తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. గతేడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టాలు 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయని, రానున్న నెలన్నరలో నీటి లభ్యత మరింత తగ్గే అవకాశం ఉందని తెలిపారు.బోర్లు ఉన్నాయనే కారణంతో అధిక నీటి అవసరమయ్యే పంటలు సాగు చేయవద్దని రైతులకు సూచించారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించాలని కోరారు. నీటి లభ్యతను బట్టి కంది, పెసర, పప్పుధాన్యాలు, పొద్దుతిరుగుడు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పప్పుధాన్యాల విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా సత్తుపల్లి ప్రాంతంలో వరి సాగు విస్తారంగా జరుగుతున్నందున అక్కడి రైతులు నీటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని కలెక్టర్ సూచించారు.

**వర్షపు నీటి సంరక్షణకు చర్యలు**

జిల్లాలో వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించేలా సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్లు, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 80 వేల మంది రైతులను ఫామ్‌పాండ్ల నిర్మాణానికి గుర్తించగా.. ఇప్పటివరకు 3 వేల మంది రైతులు అంగీకారం తెలిపారని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని నిర్ధారించలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్షాకాలం పూర్తైన తర్వాతే వర్షపాతం, పంటల పరిస్థితి, నీటి లభ్యతను సమీక్షించి కరువు పరిస్థితులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రైతులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేసి నీటి వనరులను సంరక్షిస్తే ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి కొరతను కొంతమేర నివారించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

# మేడిపల్లి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ





రానున్న స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రధానికి నరేంద్ర మోడీ జాతి ఐక్యత మరియు ప్రజల్లో జాతీయ భావం పెంపొందించడం కోసం నిర్వహిస్తున్న ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం భారతీయ జనతా పార్టీ మేడిపల్లి మండల శాఖ ఆధ్వర్యం లో బైక్ ర్యాలీ నిర్వహించింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మేడిపల్లి మండల అధ్యక్షులు చిట్యాల సురేష్ మాట్లాడుతూ దేశంలో జాతీయ భావం పెంపొందించడం కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం ద్వారా జాతి ఐక్యత దేశ గౌరవం కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం పనిచేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో భాగంగా మేడిపల్లి గ్రామానికి చెందిన మెట్టు ప్రకాష్ భారత సైన్యంలో పనిచేసి ఇటీవల పదవి విరమణ చేసిన సందర్భంగా సైనికునికి పూలదండ వేసి శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ క్యాతం దశరథ రెడ్డి మండల సీనియర్ నాయకులు ంఅ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి గోస్కి మధు, దొంగ రాజు, సర్పంచులు తొగరి రాజమని లక్ష్మీపతి , తోపారపు శ్రావణి రవికుమార్ , ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు రాచర్ల హనుమాన్లు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మేదరి శ్యామ్ యువ మోర్చా మండల అధ్యక్షులు దాసరి రఘు, మాజీ సర్పంచ్ రమేష్, మాజీ ఎంపిటిసి మేకల రాజు, మోర్చాల కార్యదర్శులు చంద రమేష్, బోయిని రఘు, నల్ల నరేందర్, హనుమంత చారి, అదే రమేష్, వడ్లగట్ట గణేష్, గణేష్, సురకంటి జీవన్,ఇట్ట సత్యనారాయణ, నల్ల రాజారెడ్డి, మేకల రంజిత్, పంచారి రాజశేఖర్, మోహన్, బండారి నరేష్, సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

# మండల ఫోటో వీడియో గ్రాఫర్ నూతన కమిటీ ఎన్నిక

**వలిగొండ ఆగస్టు12(దేశ టైమ్స్)**

మండల కేంద్రంలో బుధవారం మండల ఫోటో వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీ కమిటీని ఎలక్షన్ కమిటీ సభ్యులు జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని గణేశ్,అప్పం అంబరీష,కొంపల్లి విజయ్ కుమార్,తాటి రమేష్, బల్లెపు కృష్ణ ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలలో గౌరవ అధ్యక్షులుగా బొమ్మగాని వెంకటేష్, అధ్యక్షులుగా కొండూరు రమేష్, ఉపాధ్యక్షులుగా జువ్వగాని సుమన్, ప్రధాన కార్యదర్శిగా అవనగంటి శ్రీరామ్, కోశాధికారిగా బెల్లపు కృష్ణ సామి,సహాయ కార్యదర్శిగా మిర్యాల వెంకటేష్,ప్రచార కార్యదర్శిగా చిట్టబోయిన తిరుమలేష్,కుటుంబ భరోసా ఇంచార్జ్ కొంపల్లి విజయకుమార్,కార్యవర్గ సభ్యులుగా వేలిమినేటి రమేష్,గుండు ఉదయ్ కుమార్,దంతూరు వెంకటేష్,బద్దం అయ్యప్ప లను మండల కమిటీ సభ్యులందరి ఓటు హక్కుతో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది.



# మండల సమన్వయ మరియు సమీక్ష సమావేశం నిర్వహణ





**దేశ టైమ్స్ - దంతాలపల్లి, ఆగస్టు12;**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దంతాలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల సమన్వయ మరియు సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. సమావేశానికి సంబంధిత అధికా రులు, ప్రజా ప్రతినిధులు హాజరై మండలంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, మండల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.వేదికపై మిషన్ వైవిధ్యం మరియు మండల సమన్వయ మరియు సమీక్ష సమావేశం పేరుతో బ్యానర్లు ఏర్పాటు చేశారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు సకాలంలో అందించడంతో పాటు, మండల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల నుండి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం తమను ఆదుకోవాలని మాజీ జనశక్తి నేత ఆవేదన



భీమారం మండలం మోత్కరావుపేట గ్రామానికి చెందిన గట్ల మల్లేశం అలియాస్ అంజయ్య తండ్రి గట్ల నర్సయ్య గత1998 సంవత్సరంలో తొర్తి గ్రామంలో కుల వృత్తిలో భాగంగా బట్టలు కుట్టుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్న సమయంలో అప్పటి జన శక్తి నేతలు బట్టలు కుట్టించాలని బలవంతం చేయగా వారికి బట్టలు కుట్టించడం వల్ల నాపై1999 లో కేసు నమోదు చేయడం జరిగింది.అప్పుడు చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవించడం కూడా జరిగిందని తిరిగి వచ్చాక నాపై కొందరి ఒత్తిళ్లు ఎక్కువగా రావడం వల్ల తప్పనిసరై జనశక్తి పార్టీలోకి వెళ్లవలసి వచ్చిందని తరువాత ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలుస్తే ఆర్థిక సహాయం చేస్తాన ని చెప్పడంతో పార్టీలో కొన్ని పరిస్థితులు, ఇంటి పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని 08/04/2022 న ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 42 మంది ఒకేసారి చంద్రబాబు నాయుడు సమక్షంలో లొంగిపోవడం జరిగింది. వారు ఇచ్చిన జీవో ప్రకారం కొందరికి స్థలాలు ఇవ్వడం జరిగింది. అదే భాగంలో నాకు కూడా ఒడ్యాడు ప్రాంతంలో స్థలాన్ని కేటాయించి కాగితాలు ఇవ్వడం జరిగింది. కానీ అవి కాగితాలకే పరిమితమై స్థలాన్ని నాకు ఇప్పటికీ చూపించలేకపోయారు. ఇప్పుడు నా ఇంటి పరిస్థితి చాలా దారుణంగా ఉన్నందున ప్రస్తుతం నివసిస్తున్న ఇల్లు కూడా ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి బ్రతుకు గడవడానికి కూడా చాలా కష్టంగా ఉందని వాపోయారు కాబట్టి నాకు ఇస్తానన్న జీవో ప్రకారం ఆర్థిక సహాయం చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వాన్ని వేడుకుంటున్నానని తెలపడం జరిగింది.

## రక్తదాన శిబిరానికి డిఎస్పికి ఆహ్వాన పత్రిక అందజేత

**వలిగొండ ఆగస్టు12(దేశ టైమ్స్)**



మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు15న నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డిని ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా వెలువర్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని యాదాద్రి తలసేమియా బ్లడ్ సెంటర్ మరియు యశోద హాస్పిటల్ డాక్టర్లచే హెల్త్ చెకప్ సదన్ ఐస్ కేర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లం నరేష్, బూడిద రాజు, ప్రధాన కార్యదర్శి కూచిమల్ల నాగేష్, కోశాధికారి మల్లం సాయి, కార్యదర్శి మల్లం మహేష్, కలుకూరి విక్రమ్, కలుకూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

04 జనరల్ న్యూస్

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# అక్రమంగా నిర్వహిస్తున్న క్రషర్ నిర్మాణ పనులను వెంటనే ఆపాలి

**రైతుల ఆందోళన**

**రైతుల అభ్యంతరాలను పట్టించుకోకుండా క్రషర్‌కు అనుమతి**

**వలిగొండ ఆగస్టు12 (దేశ టైమ్స్)**






మండల పరిధిలోని పహిల్వాన్‌పూర్ గ్రామంలో పంట పొలాల మధ్య క్రషర్ మిషన్ ఏర్పాటుకు గ్రామపంచాయతీ పాలకవర్గం అనుమతి ఇవ్వడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా క్రషర్‌కు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు.గ్రామంలో ఇప్పటికే మూడుసార్లు సభలు నిర్వహించి క్రషర్ మిషన్ వద్దని గ్రామ ప్రజలు, రైతులు స్పష్టంగా అభ్యంతరం తెలిపినప్పటికీ,తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా గ్రామపంచాయతీ పాలకవర్గం అనుమతి ఇవ్వడం ఏమిటని రైతులు నిలదీశారు.క్రషర్ మిషన్ కారణంగా వెలువడే దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతినడంతో పాటు వ్యవసాయ భూములు నాశనమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.పశువుల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుందని, పంట పొలాలే తమ జీవనాధారమని తెలిపారు.మా పంట పొలాలను నాశనం చేసే క్రషర్ మిషన్ మాకు వద్దు. రైతుల అభ్యంతరాలను పట్టించుకోకుండా అనుమతి ఇవ్వడం సరికాదు అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి క్రషర్ అనుమతులను పరిశీలించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ఎలిమినేటి జంగారెడ్డి,శ్రీశైలం రెడ్డి, సత్తిరెడ్డి సునీత, మల్లారెడ్డి కలమ్మ,వెంకట్ రెడ్డి విమల,మోహన్ రెడ్డి పద్మ,శ్రీనివాస్ రెడ్డి, అంజమ్మ,బుచ్చిరెడ్డి లక్ష్మి, దుబ్బ రమేష్,బాల నర్సమ్మ,పల్లపు అంజమ్మ,శీను కనకమ్మ, సత్తిరెడ్డి వెంకట్రెడ్డి, జంగారెడ్డి,మిటకానికి కిరణ్ రెడ్డి,దుర్గమ్మ, సరిత,శారద,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# హర్ తిరంగ కార్యక్రమంలో మరిపెడలో భారీ ర్యాలీ.

**బిజెపి రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు.**



**దేశ టైమ్స్మహబూబాబాద్ /మరిపెడ,ఆగస్టు 12**

స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) దేశవ్యాప్తంగా తెలుగు రాష్ట్రాలలో ఆగస్టు 10 నుండి 15 వరకు 'హర్ ఘర్ తిరంగా( ప్రతి ఇంటిపై జాతీయ జెండా)కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.అందులో భాగంగానే మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.ఇది పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాకుండా ప్రజలలో దేశభక్తిని పెంపొందించే విధంగా చూడాలని బిజెపి రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు అన్నారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి ప్రజల్లో దేశభక్తిని ఐక్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తీర్గ్ ఇంచార్జ్ వెన్ను సాగర్,బిజెపి పట్టణ అధ్యక్షురాలు భూక్యా లింగం మంగమ్మ నాయక్,మరిపెడ మండల అధ్యక్షులు గంగాధర్, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్యా సుధాకర్ నాయక్,జగన్ నాయక్,బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ జక్కుల నాగరాజు,బింగి రమేష్,పాకాల రఘురాం శర్మ, కాంతమ్మ,రేఖ అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...



# వార్షిక తనిఖీల్లో భాగంగా రుద్రంగి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే.






రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి పొలిస్టేషన్ను వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్ను పరిశీలించి అభినందించారు.అనంతరం స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు,పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ఆరా తీసి,కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు.పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు.క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్స్ (జజుచీూ)లో అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతిక పద్ధతులను సిబ్బంది అందిపుచ్చుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించేందుకు ఈ వ్యవస్థ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సైబర్ మోసాలు, గల్ఫ్ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించలని,నకిలీ ఉద్యోగ ప్రకటనలు, వీసా మోసాలు,నకిలీ ఏజెంట్ల మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు.బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బంది గ్రామాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి అనుమానితులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా ఉంచి తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తు, ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అవి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని,నేను సైతం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో వాటి పాత్రను తెలియజేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు.ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసులు,సి.ఐ రవీందర్, ఎస్.ఐ మోతిలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్‌పై పోలీసుల ఉక్కుపాదం





**నార్కోటిక్ డాగ్‌తో బస్టాండ్, కార్గిల్ సెంటర్‌లో తనిఖీలు**

**మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 12 (దేశ టైమ్స్)**

మహబూబాబాద్ జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ శబరిష్ పి.ఐపీఎస్ ఆదేశాల మేరకు మరిపెడ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మరిపెడ బస్టాండ్, కార్గిల్ సెంటర్ పరిసరాల్లో నార్కోటిక్ డాగ్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.గంజాయి, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు అనుమానిత ప్రదేశాలు, పాన్ షాపులు, అనుమానిత ఇళ్లలో నార్కోటిక్ డాగ్ సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలను కలిగి ఉన్నా, విక్రయించినా, రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అదేవిధంగా గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు, తగిన పారితోషికం కూడా అందజేస్తామని పోలీసులు తెలిపారు.మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా అనుమానిత ప్రాంతాలపై నిఘా కొనసాగుతుందని, అవసరమైన చోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.ఈ తనిఖీల్లో మరిపెడ ఎస్ఐ గంద్రాతి సతీష్, ఎస్ఐ మైబుబి, పీసీలు రమేష్, శ్రీను తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రామానుజాచార్యుల మృతి

**మాజీ మంత్రి మాజీ డోర్నకల్ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్ సంతాపం**

**మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 12(దేశ టైమ్స్)**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకుల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రధానాచార్యులు, ఆలయ అనువంశిక మాజీ చైర్మన్, వైష్ణవ పాంచరాత్ర ఆగమ పండితులు నల్లాన్ చక్రవర్తుల రామానుజాచార్యులు బుధవారం స్వర్గస్తులయ్యారు.విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్ మాకులలోని ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామానుజాచార్యుల మృతి ఆధ్యాత్మిక రంగానికి, భక్తులకు తీరని లోటని పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి, ధార్మిక కార్యక్రమాలకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎండీ అయూబ్ పాషా, హతీరామ్, కౌన్సిలర్ బోడ భాస్కర్, ఉప్పల సతీష్, ఉప్పల మల్లు తదితరులు పాల్గొని రామానుజాచార్యుల భౌతికకాయానికి నివాళులర్పించారు.



Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280